# ధరాఘాతం

**ఇరకాటంలో ఇంటి బడ్జెట్ • సబ్బులు, హెయిర్ ఆయిల్స్ ప్రియం**

**2 నుంచి 11 శాతం పెరిగిన రేట్లు • సామాన్యుల నెత్తిన భారం**

**ఆయా ఆహారోత్పత్తుల ధరలూ 17 శాతందాకా పైకి**



*ధరలు పెరుగుతున్నాయి. ఇంటి ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి.*

*సబ్బులు, సర్ఫ్ పొడర్ల దగ్గర్నుంచి తలంటుకునే నూనెలు, పొద్దున్నే చకచకా చేసుకుతినే నూడుల్స్‌దాకా ప్రియమైపోయాయి.*

*ఎఫ్ఎంసీజీ కంపెనీలు ఆహార, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల రేట్లను పెంచడంతో గత 2-3 నెలలుగా నెలవారీ షాపింగ్ బిల్లులు మోత మోగిస్తున్నాయి మరి.*

న్యూఢిల్లీ, జూన్ 18: ధరల మంట మొదలైంది. సామాన్యుల ఇంటి బడ్జెట్ తలకిందులవుతున్నది. సబ్బులు, హెయిర్ ఆయిల్స్, ఆహారోత్పత్తులు అన్నింటి రేట్లనూ ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ) కంపెనీలు పెంచుకుంటూపోతున్నాయి మరి. గడిచిన 2-3 నెలల్లో 2 నుంచి 17 శాతం వరకు పెరిగిన ధరలతో బిల్లులు మోత మోగిస్తున్నాయి. గత కొంత కాలంగా మౌనంగా ఉన్న సంస్థలు.. ఇప్పుడు మళ్లీ బాదుడు మొదలుపెట్టాయి. రాష్ట్ర, జాతీయ స్థాయి ఎన్నికలు ముగిసిన వేళ.. ఎఫ్ఎంసీజీల రేట్ల పెంపు ప్రస్తుతం సర్వత్రా ఆసక్తిదాయకంగా మారుతున్నది.

### ఇదీ సంగతి..

సబ్బులు, బాడీ వాష్‌ల ధరలు 2 నుంచి 9 శాతం పెరిగినట్టు తాజా లెక్కలు చూస్తే అర్థమవుతున్నది. హెయిర్ ఆయిల్స్ ధర 8 నుంచి 11 శాతం ఎగబాకగా, వివిధ రకాల ఆహారోత్పత్తుల ధరలు 3 నుంచి 17 శాతం ఎగిసినట్టు తేలింది. నిజానికి 2022, 2023 ప్రథమార్ధం వరకు ధరల్ని పెంచుతూపోయిన ఎఫ్ఎంసీజీ సంస్థలు.. ఆ తర్వాత సైలెంటైపోయాయి. ముఖ్యంగా క్రూడ్, పామాయిల్ ధరలు మార్కెట్‌లో తగ్గుముఖం పడుతున్న వేళ సబ్బుల ధరలు పెరగడం గమనార్హం. ఇక పాలు, చక్కెర, కాఫీ, కొబ్బరి, బార్లీ వంటి వాటి ధరలు కూడా విజృంభిస్తున్నాయి.

### ఇంకా పెరగొచ్చు


ఆయా ఉత్పత్తుల ధరలు ఇప్పటికే పెరిగాయని, మున్ముందు ఇంకా పెరుగుతాయని కంపెనీలు స్పష్టం చేస్తున్నాయి. ఇటీవలి త్రైమాసిక ఆర్థిక ఫలితాల సందర్భంగా ఎఫ్ఎంసీజీ దిగ్గజం మారికో.. ఏప్రిల్‌లో హెయిర్ ఆయిల్ ధరలను 6 శాతం పెంచామని, కొబ్బరి రేట్లు పెరుగుతున్నందున మళ్లీ పెరిగేందుకు వీలున్నదని సంకేతాలిచ్చింది. టాటా కన్జ్యూమర్ సైతం ఇదే దారిలో వెళ్తున్నది. డాబర్, ఇమామీ రేట్లు కొంతమేర పెరుగుతాయంటున్నాయి. మరోవైపు కూరగాయల ధరలు ఠారెత్తిస్తున్నాయి. కిలో టమాట సెంచరీ దిశగా పరుగు పెడుతుంటే, ఉల్లి హాఫ్ సెంచరీ కొట్టింది. పచ్చి మిర్చి రూ.80 పలుకుతున్నది. బెండ, దొండ ధరలూ పైపైకిపోతున్నాయి. అన్ని రకాల పప్పుల ధరలూ కిలో రూ.120 నుంచి 180 మేర పలుకుతున్నాయి.

- *వివిధ రకాల సబ్బుల ధరల్ని 4-5 శాతం పెంచిన గోద్రెజ్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్. డవ్ సోప్ ధరను 2 శాతం పెంచిన హిందుస్థాన్ యునిలీవర్ లిమిటెడ్. సంతూర్ సబ్బు ధరను 3 శాతం పెంచిన విప్రో.*
- *పెరిగిన కాల్గేట్ పామోలివ్ బాడీ వాష్ ధరలు. 4 శాతం పెరిగిన పియర్స్ బాడీ వాష్ రేటు.*
- *హెచ్‌యూఎల్ డిటర్జంట్ బ్రాండ్లు, పీఅండ్‌జీ హైజిన్-హెల్త్‌కేర్, జ్యోతీ ల్యాబ్స్ ఉత్పత్తుల రేట్లు 1 నుంచి 10 శాతం పుంజుకున్నాయి.*
- *హెచ్‌యూఎల్‌కు చెందిన షాంపూ ధరలు, స్కిన్ కేర్ ఉత్పత్తుల రేట్లు 4 శాతం వరకు ఎగిశాయి.*
- *8-13 శాతం పెరిగిన నెస్లే కాఫీ ధర. మ్యాగీ ఓట్స్ నూడుల్స్ ధర 17 శాతం ఎగిసింది. ఐటీసీ ఆశీర్వాద్ గోధుమ ధరలూ పైకెక్కాయి.*

# నేర్చుకోలేకపోతున్నారు..

**పెరుగుతున్న 'లౌడ్ లెర్నింగ్' • లింక్డ్ఇన్ తాజా సర్వే**

## పని, కుటుంబ ఒత్తిళ్లతో నైపుణ్యాభివృద్ధిలో వెనుకబడుతున్న ఉద్యోగులు



న్యూఢిల్లీ, జూన్ 18: నేర్చుకోవడానికి వీలుగా మా సంస్థలు అన్ని అవకాశాలు కల్పిస్తున్నా వాటిని అందిపుచ్చుకోలేకపోతున్నామని ఉద్యోగులు వాపోతున్నారు. పని ఒత్తిళ్లు, కుటుంబ బాధ్యతల వల్లే నైపుణ్యాభివృద్ధిలో వెనుకబడుతున్నట్టు మెజారిటీ ఎంప్లాయిస్ చెప్తున్నారు. అవును.. దేశంలోని ప్రతీ 10 మంది ఉద్యోగ నిపుణుల్లో 9 మందిది ఇప్పుడిదే మాట అంటున్నది ప్రముఖ ప్రొఫెషనల్ నెట్‌వర్క్ లింక్డ్ఇన్ తాజా నివేదిక ఒకటి. మార్కెట్‌లో వస్తున్న మార్పులకు, మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా తమ ఉద్యోగులకు తర్ఫీదునిస్తూపోతున్నాయి చాలా కంపెనీలు. అయితే ఆఫీస్‌లో పని భారం, వ్యక్తిగత లేదా కుటుంబ బాధ్యతలతో సతమతమైపోతూ శిక్షణపై అత్యధిక ఉద్యోగులు దృష్టి సారించలేకపోతున్నారు. 91 శాతం ఉద్యోగులది ఇదే పరిస్థితి అని లింక్డ్ఇన్ తాజా అధ్యయనంలో తేలింది.

### లౌడ్ లెర్నింగ్

పని ఒత్తిడి, వ్యక్తిగత కారణాలతో కంపెనీలు ఇస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఆసక్తి చూపలేకపోతున్న ఉద్యోగులు.. తమకున్న అడ్డంకులను అధిగమించడానికి 'లౌడ్ లెర్నింగ్' మంత్రాన్ని జపిస్తున్నారు. ఆఫీసులు లేదా పనిచేసే చోట నేర్చుకోవాలన్న లక్ష్యాలపై తమకున్న ఆసక్తిని ఉద్దేశపూర్వకంగా గట్టిగా వ్యక్తపరిచే చర్యనే ఈ 'లౌడ్ లెర్నింగ్' అంటారు. ఇది తమ కెరియర్ వృద్ధికి దోహదపడగలదని ఏకంగా 79 శాతం మంది ఉద్యోగులు విశ్వసిస్తుండటం గమనార్హం. ఇక లింక్డ్ఇన్ సైతం ఉద్యోగ నిపుణుల కోసం కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత అత్యుత్తమ సాధనాలను అందుబాటులోకి తెచ్చింది. కాగా, అనుభవజ్ఞులైన నిపుణుల నుంచి మెంటార్‌షిప్, గైడెన్స్ అవసరమని, కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేలా శిక్షణ కావాలని, మారుతున్న టెక్నాలజీ, పరిస్థితులపై అవగాహనను పెంచుకోవడం తప్పనిసరి అని ఈ అధ్యయనంలో పాల్గొన్న ఎక్కువమంది ఉద్యోగులు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం చాలా కంపెనీలు ఏఐ ఆధారిత సేవలు, ఉత్పాదకతపై దృష్టి పెడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే పెద్ద ఎత్తున ఉద్యోగ కోతలూ జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజా సర్వే ప్రాధాన్యతను సంతరించుకున్నది.

***దేశంలో ఉద్యోగాల కోసం ఇప్పుడు అవసరమైన నైపుణ్యాల్లో 2030 నాటికి 64 శాతం మారిపోవచ్చు. అందుకే ఉద్యోగులు ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని ఆహ్వానిస్తూపోవాలి. నయా టెక్నాలజీలు, నూతన అంశాలపై దృష్టి సారించి వాటిలో ఆరితేరాలి. అప్పుడే కొలువులు భద్రంగా ఉంటాయి.***

***-నిరాజితా బెనర్జీ, లింక్డ్ఇన్ కెరియర్ ఎక్స్‌పర్ట్***

## ఎల్ అండ్ టీకి భారీ ఆర్డర్లు

న్యూఢిల్లీ, జూన్ 18: ఎల్అండ్‌టీకి హైదరాబాద్, ముంబైల నుంచి భారీ ఆర్డర్లు లభించాయి. బిల్డింగ్స్ అండ్ ఫ్యాక్టరీస్ (బీఅండ్ఎఫ్) విభాగం నుంచి ఇవి వచ్చాయని సంస్థ వెల్లడించింది. ఆర్డర్ విలువ సంస్థ వెల్లడించకపోయినప్పటికీ ప్రాజెక్ట్ విలువ ఆధారంగా రూ.1,000 కోట్ల నుంచి రూ.2,500 కోట్ల మధ్యలో ఉంటుందని అంచనా.

## 'ఇప్పట్లో వడ్డీరేట్లు తగ్గవు'

ముంబై, జూన్ 18: ఇప్పట్లో వడ్డీ రేట్లు తగ్గే అవకాశాలు లేవని, సమయం వచ్చినప్పుడు రేట్లపై నిర్ణయం తీసుకుంటామని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టంచేశారు. ఈటీ నౌస్ లీడర్‌షిప్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..పరపతి సమీక్షను అత్యవసరంగా మార్చాల్సిన అవసరం లేదని, ద్రవ్యోల్బణం దిగొచ్చాక, మిగతా పరిణామాలను కూడా బేరీజు వేసుకున్న తర్వాతనే రేట్ల తగ్గింపుపై నిర్ణయం తీసుకుంటామన్నారు. మరోవైపు ఫ్యూచర్, ఆప్షన్ ట్రేడింగ్ మార్కెట్లలో అధిక ట్రేడింగ్ గణాంకాలపై సెబీతో కలిసి ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. అలాగే మార్చి త్రైమాసికపు కరెంట్ ఖాతా లోటును వచ్చేవారంలో విడుదల చేస్తామన్నారు.

## న్యూయార్క్ స్థాయిలో హైదరాబాద్ వృద్ధి

**సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): అమెరికాలో స్థిరపడిన రాష్ట్ర ప్రజలు న్యూయార్క్‌తో పోల్చుకునేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉన్నదని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కుష్మన్ అండ్ వేక్ ఫీల్డ్ ఆసియా పసిఫిక్ సీఈవో మ్యాథ్యూ భౌ ప్రతినిధి బృందం మంగళవారం సచివాలయంలో సీఎంతో భేటీ అయ్యింది. హైదరాబాద్ గ్లోబల్ సిటీగా వృద్ధి చెందుతున్న తీరు, వివిధ రంగాలు విస్తరిస్తున్న తీరుపై వారు చర్చించారు. తమ ప్రభుత్వం చేపట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు రూట్ విస్తరణతో హైదరాబాద్ మరింత అద్భుతంగా తయారుకానున్నదని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తాము దేశంలోని ఇతర నగరాలతో పోటీ పడటం లేదని, హైదరాబాద్‌ను ప్రపంచంలో పేరొందిన నగరాల సరసన నిలబెట్టాలనేది తమ సంకల్పమన్నారు. ఈ సందర్భంగా మ్యాథ్యూ భౌ మాట్లాడుతూ.. దేశంలోనే హైదరాబాద్ శరవేగంగా వృద్ధి చెందుతున్నదని, గత ఆరు నెలల్లో రియల్టీతోపాటు ఆఫీస్ స్థలాల లీజు, నిర్మాణం, రెసిడెన్షియల్ స్పేస్‌లోనూ గణనీయమైన వృద్ధి నమోదు చేసిందన్నారు. మరోవైపు, మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డితో లాక్ హీడ్ మార్టిన్ కంపెనీ హెడ్ మిస్టర్ ఫర్నాండేజ్ భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో ఎన్ఎండీసీ పరిశోధన సెంటర్


హైదరాబాద్, జూన్ 18: ఖనిజ ఉత్పత్తిలో అగ్రగామి ప్రభుత్వరంగ సంస్థయైన ఎన్ఎండీసీ.. తాజాగా హైదరాబాద్‌లో పరిశోధన-అభివృద్ధి కేంద్రాన్ని(ఆర్అండ్‌డీ సెంటర్) ప్రారంభించింది. ఖనిజ ఉత్పత్తి, ప్రాసెసింగ్, స్థిరమైన ఉక్కు సాంకేతికలో ఆవిష్కరణలే లక్ష్యంగా పటాన్‌చెరు వద్ద ఎనిమిది ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన సెంటర్ కోసం రూ.50 కోట్ల నిధులు వెచ్చించినట్లు కంపెనీ సీఎండీ(అదనపు) అమితావ ముఖర్జీ తెలిపారు. స్థిరమైన వృద్ధిని నమోదు చేసుకుంటున్న దేశీయ గనుల రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

# దూసుకుపోతున్న స్టాక్ మార్కెట్లు

**77 వేల పైకి సెన్సెక్స్ • 308 పాయింట్లు పుంజుకున్న సూచీ**

ముంబై, జూన్ 18: దేశీయ స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. బెంచ్‌మార్క్ ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ తొలిసారిగా 77 వేల మార్కును అధిగమించగా, నిఫ్టీ సైతం మరో ఉన్నత శిఖరాలకు చేరుకున్నది. బ్లూచిప్ సంస్థల షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుకు తోడు, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలకు కిక్కునిచ్చాయి. 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 308.37 పాయింట్లు అందుకొని నూతన గరిష్ఠ స్థాయి 77,301.14 వద్ద ముగిసింది. ఇంట్రాలో 374 పాయింట్లు ఎగబాకి లైఫ్‌టైం హై 77,367 తాకి చివర్లో ఈ లాభాలను నిలుపుకోలేకపోయింది. మరో సూచీ నిఫ్టీ 92.30 పాయింట్లు ఎగబాకి రికార్డు స్థాయి 23,557.90 వద్ద స్థిరపడింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ రికార్డు స్థాయి రూ.4,37,24,261.40 కోట్లు(5.24 ట్రిలియన్ డాలర్లకు) చేరుకున్నది. గత నాలుగు సెషన్లలో మదుపరుల సంపద రూ.10.29 లక్షల కోట్ల మేర పెరిగింది. సూచీల్లో పవర్ గ్రిడ్, విప్రో, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎస్బీఐ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. కానీ, మారుతి, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్, టాటా మోటర్స్, ఐటీసీ, టీసీఎస్‌లు నష్టపోయాయి.

## మహీంద్రా వరి నాటే యంత్రం



ధర : 2.50 లక్షలు

హైదరాబాద్, జూన్ 18: మహీంద్రా అండ్ మహీంద్రా.. వ్యవసాయ ఉత్పత్తుల విభాగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా తెలుగు రాష్ర్టాల్లో ఆరు వరుసల వరి నాటే 6ఆర్‌వో యంత్రాన్ని ఆవిష్కరించింది. వరిసాగు సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు అత్యంత శక్తివంతమైన, సమర్థవంతమైన ఇంజిన్, అధునాతన టెక్నాలజీతో దీనిని రూపొందించింది. మహీంద్రా ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్‌తోపాటు ఇతర ఆర్థిక సంస్థల నుంచి 75 శాతం వరకు ఫైనాన్స్ లభించనున్నది.

## జోరుగా పన్ను వసూళ్లు

న్యూఢిల్లీ, జూన్ 18: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.4,62,664 కోట్ల ప్రత్యక్ష పన్నులు వసూలైనట్లు ఐటీ శాఖ వెల్లడించింది. ఈ నెల 15 నాటికి తొలి విడత అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు 27.34 శాతం ఎగబాకి రూ.1.48 లక్షల కోట్లకు పెరగడం కలిసొచ్చింది.

# జలం.. జీవం

- **ఫాంపాండ్‌లతో బహుళ ప్రయోజనం..**
- **ఉపాధి హామీలో ఉచితంగా నిర్మాణం**
- **బోరుబావుల రీచార్జీకి ఊతం**





మాక్లూర్, జూన్18: నీటి సమస్యను అధిగమించడానికి ఫాంపాండ్ల నిర్మాణం తప్పనిసరిగా మారింది. వీటి నిర్మాణానికి ముందుకు వచ్చిన ప్రతి రైతుకూ వారి పంట భూముల్లో ఉచితంగా ప్రభుత్వమే ఫాంపాండ్ నిర్మిస్తోంది. దీంతో వ్యవసాయ బోరుబావుల రీచార్జీతోపాటు వర్షాభావ పరిస్థితుల్లో పంటలకు నీరందే అవకాశం ఉంది. ముఖ్యంగా నాన్ కమాండ్ ఏరియాల్లో బోరు బావుల కింద సాగయ్యే పంట భూముల రైతులకు ఇది సదావకాశంగా చెప్పవచ్చు. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతుల పంట భూముల్లో విరివిగా ఫాంపాండ్ల నిర్మాణం చేపడుతున్నారు. దీంతో భూగర్భ జలాల వృద్ధికి వీటి నిర్మాణం ఎంతగానో దోహదపడనున్నది. వీటితో రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరనున్నాయి.

**ప్రయోజనాలెన్నో..**

వ్యవసాయ క్షేత్రంలో పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీటిని నిల్వ చేసుకోవడానికి ఫాంపాండ్ ఎంతో ఉపయోగపడుతుంది. వీటితో రైతులకు వివిధ రకాల ఉపయోగాలున్నాయి. ప్రధానంగా భూగర్భ జలాలు పెరుగుతాయి. ఫలితంగా ఆ భూమిలో బావులు అడుగంటకుండా ఉంటాయి. ఫాంపాండ్‌లోకి చేరిన ప్రతినీటి చుక్క అదే ప్రాంతంలోభూమిలోకి ఇంకి ఎప్పటికప్పుడు బోరుబావులు రీచార్జీ అవుతుంటాయి. కాలం కానప్పుడు కనీసం పంటలకు తడులు ఇచ్చే స్థితిలోనైనా బోరుబావులు ఉంటాయి. వర్షాధార పంటలకు ఒకటి,రెండు తడులకు సరిపడా నీటిని నేరుగా వాడుకోవడానికి వీలుంటుంది. వివిధ సైజుల్లో ఫాంపాండ్లు నిర్మించుకోవచ్చు. సాధారణంగా ఫాంపాండ్ నిర్మాణానికి స్థలం వృథాగా పోతుందని భావిస్తుంటారు. కానీ ఫాంపాండ్ కోసం వదిలేసే స్థలంలో వేసే పంట కన్నా ఫాంపాండ్ ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలు అనేకం. ఎకరాల్లో పంటలను వర్షాభావ పరిస్థితుల్లో కాపాడేలా బోరుబావులు రీచార్జీ అవుతాయని గుర్తించాలి. వర్షపు నీటి ప్రవాహవేగానికి సారవంతమైన మట్టి కొట్టుకపోకుండా కాపాడుకోవచ్చు.

### ప్రభుత్వ ప్రోత్సాహం

- రైతులు మూడు రకాల సైజుల్లో ఫాంపాండ్‌లు నిర్మించుకోవచ్చు
- 12మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పు, 2 మీటర్ల లోతుతో కూడిన ఫాంపాండ్‌కు అంచనా విలువ రూ.75 వేలు
- 15 మీటర్ల పొడవు, 15మీటర్ల వెడల్పు, 2 మీటర్ల లోతుతో కూడిన ఫాంపాండ్‌కు అంచనా విలువ లక్ష రూపాయలు
- 20మీటర్ల పొడవు, 20మీటర్ల వెడల్పు, 2మీటర్ల లోతుతో కూడిన ఫాంపాండ్‌కు అంచనా విలువ రూ.3 లక్షలు
- రైతుల ఇష్టాన్ని బట్టి ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే వీటిలో రైతు ఏ రకాన్ని కోరుకుంటే ఆ రకపు గుంతను ప్రభుత్వమే ఉచితంగా తవ్వించి ఇస్తుంది.

మామిడి, జామ, సీతాఫలం, పండ్ల తోటలతో పాటు పూలమొక్కలు పెంచవచ్చు. తద్వారా రైతు అదనపు ఆదాయాన్ని పొందడానికి అవకాశం ఉంటుంది. చేపల పెంపకాన్నీ చేపట్టవచ్చు.

### ఎంపీడీవోకు దరఖాస్తు చేసుకోవాలి



ఉచితంగా ఫాంపాండ్ నిర్మాణం కోసం రైతులు ఎంపీడీవోకు దరఖాస్తు చేసుకోవాలి. గతంలో అక్కడక్కడ కొందరు రైతులు ఫాంపాండ్‌లు నిర్మించుకున్నారు. కానీ విరివిగా ఏర్పాటు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఇందులోభాగంగానే ఉపాధి హామీ పథకంలో వీటి నిర్మాణాలు చేపడుతున్నాం. వీటి నిర్మాణం ద్వారా వృథా జలాలు, వర్షపు నీటిని నిల్వ చేసుకోవచ్చు. నాలుగు దిక్కుల మట్టిని తీసి, మూడు దిక్కుల మట్టిని పోయడంతో వీటి నిర్మాణం జరుగుతుంది. పోసిన మట్టిపై కూరగాయలు, పండ్ల మొక్కలు పెంచుకొని ఆర్థికంగా లాభం పొందవచ్చు

**-ఓంకార్, ఏపీవో, మాక్లూర్**

## ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి, జూన్ 18 : ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో బంజారా హిల్స్ హైదరాబాద్‌లో నిర్వహించనున్న సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల ఉచిత శిక్షణకు ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిణి శశికళ, ఎస్సీ స్టడీ సర్కిల్ హానరరీ డైరెక్టర్ రాజగంగారాం తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రాతపరీక్ష ద్వారా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు డిగ్రీ ఉత్తీర్ణులై, వార్షిక ఆదాయం రూ.3లక్షలకు మించరాదని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులను ఈనెల 17 నుంచి జూలై 10 వరకు tsstiducircle.co.in వెబ్‌సైట్‌లో స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష జూలై 21న నిజామాబాద్‌లో నిర్వహిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు 040-23546552, 7702175493 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## నిబంధనలు పాటించాలి

భీమ్‌గల్, జూన్ 18: వాహనదారులు నిబంధనలు పాటించాలని ఎంవీఐ వివేకానందరెడ్డి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులతో కలిసి మండల కేంద్రంలో ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేని, సరైన పత్రాలు లేని వాహనాలను గుర్తిం చి సీజ్ చేసినట్లు ఎంవీఐ తెలిపారు. 22 ద్విచక్రవాహనాలు, ఒక గూడ్స్ వాహనం స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో భీమ్‌గల్ ఎస్సై హరిబాబు, కమ్మర్‌పల్లి ఎస్సై రాజశేఖర్, ఆర్డీవో సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## యూనిఫామ్‌ల తయారీని వేగవంతం చేయాలి

**కామారెడ్డి అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్**

బిచ్కుంద, జూన్ 18: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించేందుకు యూనిఫామ్‌ల తయారీని వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు యూనిఫామ్‌లు కుడుతున్న కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. యూనిఫామ్‌ల తయారీ బాగుండాలన్నారు. కొలతల ప్రకారం దుస్తులను సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. మిషన్ భగీరథ సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం నాగరాజు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఏకరూప దుస్తుల కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్

## అత్తను చంపిన కోడలు రిమాండ్

బిచ్కుంద, జూన్ 18: డబ్బుల విషయంలో జరిగిన గొడవలో అత్తను చంపిన కోడలును పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్సై మోహన్ రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బండారెంజల్ గ్రామానికి చెందిన విఠబోయి ధాన్యం విక్రయించగా డబ్బులు వచ్చాయి. వాటిని తమకు ఇవ్వాలని కోడలు అంజవ్వ కోరింది. దానికి అత్త బాలవ్వ ఒప్పుకోకపోవడంతో ఇద్దరి మధ్య శుక్రవారం గొడవ జరిగింది. దీంతో బాలవ్వను కోడలు గొంతును లిమి హత్య చేసింది. అప్పటి నుంచి పరారీలో ఉన్న అంజవ్వ మంగళవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయిందని ఎస్సై తెలిపారు. ఈ మేరకు ఆమెను రిమాండ్‌కు తరలించామన్నారు.

## కాంగ్రెస్ సీనియర్ నేతపైప్రజావాణిలో మహిళ ఫిర్యాదు

ఖలీల్‌వాడి (మోపాల్), జూన్ 18: మోపాల్ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిపై జిల్లాకు చెందిన ఓ మహిళ హైదరాబాద్‌లోని బేగంపేట క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యా దు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు తనను అన్ని విధాలుగా ఆదుకుంటానని చెప్పి మోసం చేశాడని ఆరోపించింది. తనతో 20 ఏండ్లుగా ఉంటున్నాడని, తమకు పుట్టిన కుమారుడి (19)ని పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేసింది. ఇల్లు , మూడెకరాల పొలం ఇస్తానని చెప్పి మోసం చేశాడని, అడిగితే తనతోపాటు తన కుమారుడిని చంపేస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించింది. న్యాయం చేయాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో ఆదిలాబాద్‌వాసి మృతి

డిచ్‌పల్లి, జూన్ 18 : జక్రాన్‌పల్లి మండలంలోని 44 జాతీయ రహదారి వద్ద మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన బంకలవాడు బాలాజీ (50) మృతి చెందినట్లు స్థానిక ఎస్సై తిరుపతి తెలిపారు. బాలాజీ రెండు రోజుల క్రితం నందిపేట్ మండలం కంఠం గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్లడానికి ఆర్మూర్ మీదుగా 44వ నంబర్ జాతీయ రహదారి వద్ద ఉన్న బ్రాహ్మణ్‌పల్లి వంతెన వద్దకు వచ్చాడు. ఆదిలాబాద్ వైపు వాహనం కోసం రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం బాలాజీని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

## బిచ్కుందలో భారీ వర్షం

బిచ్కుంద, జూన్ 18: మండలంలో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురి సింది. ఈదురుగాలులతో పాటు వర్షం కురియ డంతో పలు గ్రామాల్లో చెట్లు నేలకొరిగాయి. చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతో అవి తెగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షం కురియడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

## దొంగిలించిన బైక్ కోసం..

**బంధువును హతమార్చిన వ్యక్తి రిమాండ్**

భిక్కనూర్, జూన్ 18 : వారిద్దరు బంధువులు. ఇద్దరూ కలిసి ఓ బైక్‌ను దొంగిలించారు. ఆ బైక్‌ను తానే సొంతం చేసుకోవాలనే దుర్బుద్ధితో ఇద్దరిలో ఒకరు కల్లుసీసాలో గడ్డి మందు కలిపి బంధువుకు తాగించగా.. సదరు వ్యక్తి దవాఖానలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘ టన భిక్కనూర్ మండల కేంద్రంలో ఈ నెల3న చోటుచేసుకోగా.. మంగళవారం నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. సీఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. రామాయంపేట మండలం దామరచెరువు గ్రామానికి చెందిన జక్రిపోతుల బాబా శేఖర్, భిక్కనూర్‌కు చెందిన రంజిత్ బంధువులు. ఇద్దరు కలిసి ఓ బైక్‌ను దొంగిలించి, దానిని రామయంపేట్‌లో ఈ నెల 2వ తేదీన దాచి ఉంచారు. మరుసటి రోజు భిక్కనూర్ మండల కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద ఇద్దరూ కలిసి కల్లు తాగడానికి వచ్చారు. బజ్జీలు తీసుకురమ్మంటూ శేఖర్..రంజిత్‌ను బయటికి పంపించాడు. అప్పటికే శేఖర్ తన వెంట తెచ్చుకున్న గడ్డి మందును కల్లు సీసాలో కలిపి రంజిత్‌కు తాగించాడు. విషయం తెలుసుకున్న స్థానికులు అపస్మారక స్థితిలోకి వెళ్లిన రంజిత్‌ను దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం గాంధీ దవాఖానకు తరలించగా..చికిత్స పొందుతూ ఈ నెల 14న మృతిచెందాడు. రంజిత్ మృతికి కారణమైన బాబా శేఖర్‌ను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు.